ఎఎన్‌ఎంపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - రాయచోటి

పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడిన ఎఎన్‌ఎంపై సస్పెన్స్ వేటు పడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31న జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్లు పంపిణీ చేయాలి. రాయచోటి మున్సిపల్ పరిధిలో పెన్షన్ల పంపిణీలో ఓ ఎఎన్‌ఎం అవినీతికి పాల్పడుతున్నట్లు కొంతమంది నుంచి కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారించారు. రాయచోటి మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డు ఎఎన్‌ఎం రూ.100 చొప్పున పెన్షనర్ల నుంచి వసూలు చేసినట్లు విచారణలో తేలింది. అవినీతికి పాల్పడిన సదరు ఎఎన్‌ఎంను వెంటనే సస్పెండ్ చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్, డిఎంహెచ్‌ఒలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాయచోటి మున్సిపల్ కమిషనర్ నివేదిక ఆధారంగా సదరు ఎఎన్‌ఎంను డిఎంహెచ్‌ఒను సస్పెండ్ చేశారు. పేదలకు ఆర్థిక భరోసా అందించే ఇటువంటి కార్యక్రమాలలో ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

ధ్రువీకరణ పరిశీలన పక్కాగా ఉండాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో వికలాంగుల పెన్షన్ల ధ్రువీకరణ పరిశీలన కార్యక్రమాన్ని పక్కగా చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సెర్ఫ్ సిఇఒ వీర్య పాండ్యన్ సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల స్క్రీనింగ్ నూతన మార్గదర్శకాలపై జిల్లా కలెక్టర్లు, డిఆర్‌డిఎ, వైద్యారోగ్య, మున్సిపల్, జిఎస్డబ్ల్యూఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ఫ్ సిఇఒ వీర్య పాండ్యన్ ప్రభుత్వం ద్వారా జారీ చేయనున్న నూతన మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో అవగాహన కల్పించారు. ప్రతి జిల్లాలో వైద్య బృందాల ద్వారా సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల పరిశీలనను పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. సమావేశం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేయనున్న మార్గదర్శకాలను అనుసరించి సదరం వైకల్య ధ్రువీకరణ పత్రాల స్క్రీనింగ్ నిమిత్తం జిల్లాస్థాయిలో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీరి ఆధ్వర్యంలో వివిధ మండల స్థాయి బృందాలను ఏర్పాటు చేస్తారన్నారు. ఆరోగ్య పింఛనుదారుల ధ్రువీకరణ క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఒక స్పష్టమైన రోడ్డు మ్యాప్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో 85 శాతం, 40 శాతం పైబడిన రెండు కేటగిరీలలో పరిశీలన పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 1600 మంది వరకు 85శాతం పైబడి వైకల్యత్వం కలిగిన వారు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయని, వాటిని పరిశీలించాల్సిన బృందాల సంఖ్య ప్రకారం రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ వారీగా ఆయా మండలంలో ఏ గ్రామంలో ఎన్నెన్ని పెన్షన్లు ఉన్నాయన్న సమాచారాన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. బృందాలు ఏర్పాటైన పిదప షెడ్యూల్ ప్రకారం పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఎవరి ఒత్తిడికి గురికాకుండా పారదర్శకంగా పరిశీలన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల మేరకు బృందాల ఏర్పాటు నిమిత్తం డిఎంహెచ్‌ఒ, డిసిహెచ్‌ఎస్, కడప జిజిహెచ్ సూపరింటెండెంట్‌లతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లే బృందాలకు సరైన వసతి సౌకర్యాలు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ పీడీని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసే నూతన మార్గదర్శకాలు జిల్లాకు అందిన వెంటనే వైద్య బృందాల కేటాయింపు, పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టి నిర్దేశిత కాలం పరిమితిలోగా త్వరితగతిని పూర్తిచేయాలని చెప్పారు. అనంతరం వివిధ అంశాలలో కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, వైద్యారోగ్య, పంచాయతీ, జిఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ గురువారం రాయచోటిలోని అలిమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్ ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలుగు నాట ఒక చారిత్రక అవసరం కోసం 1974, ఆగస్టు 10న ఆవిర్భవించిన యుటిఎఫ్ విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం తద్వారా సమాజాభివృద్ధికి కృషి చేస్తూ 50 ఏళ్లల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విస్తరిస్తూ రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా ఉందన్నారు. కాకినాడలో ఈ నెల 5, 6, 7, 8వ తేదీల్లో నాలుగు రోజుల్లో మొదటి రోజు ప్రారంభ సభ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేసి ప్రారంభసభలో మాట్లాడుతారన్నారు. రెండవ రోజు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారు హాజరు అవుతారని తెలిపారు. ఈ మహా సభల సందర్భంగా భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం, ఉపాధ్యాయుల సంక్షేమం, రావాల్సిన ఆర్థిక బకాయిల సాధన తదితర విషయాలపై చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హాఫిజ్, రాజా రమేష్, సహాధ్యక్షులు రెడ్డి బసయ్య, నాయకులు పాల్గొన్నారు.

మేస్త్రీకి సర్టిఫికేట్ అందజేత ఎంవిఐ, అధికారులు

చేతివృత్తిదారులకు 'పీఎం విశ్వకర్మ' ఉపయుక్తం : ఎంవిఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చేతివృత్తిదారులకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ఎంతో ఉపయుక్తమని, ఈ పథకాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివలింగయ్య, డాక్టర్ స్వాతి చక్రపాణి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వున్న శిక్షణ కేంద్రంలో ఏడు రోజుల పాటు తాపీ మేస్త్రి శిక్షణ పూర్తి చేసుకొన్న వారికి గురువారం సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివలింగయ్య మాట్లాడుతూ తాపీమేస్త్రిగా శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ నైపుణ్యాన్ని మరింతగా పెంచుకొని చక్కగా రాణించాలని సూచించారు. పోటీ ప్రపంచంలో ప్రతిభ ఉంటేనే ప్రతిఫలం దక్కుతుందని ఇలాంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకున్నప్పుడే మెరుగైన ప్రతిభతో రాణించే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ స్వాతి చక్రపాణి మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ ద్వారా రూ.లక్ష వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణం పొందే అవకాశం, శిక్షణ కాలంలో రోజుకు రూ.500 స్టైఫండ్, రూ.15 వేలు విలువ చేసే టూల్ కిట్ ఉచితంగా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ యోజన ట్రైనింగ్ పార్ట్‌నర్ చక్రపాణి, మధుసూదన్, 71 మంది తాపీ మేస్త్రి ట్రైనర్స్, కో-ఆర్డినేటర్ శంకరయ్య, సిబ్బంది ప్రసన్న, వినీత పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీల్లో విజయలక్ష్మి ప్రతిభ

ప్రజాశక్తి -సంబేపల్లి (రాయచోటి) : జాతీయ యోగాసన పోటీలలో ప్రతిభ కనపరిచిన విజయలక్ష్మిని గురువారం మండల కేంద్రంలోని సంబేపల్లి హైస్కూల్‌లో కాంప్లెక్స్ ఉపాధ్యా యులు ఘనంగా సన్మానించారు. జార్ఖండ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుండి 31 వరకు 6 రోజులపాటు 43వ జాతీయ యోగాసన పోటీలను నిర్వహించారు. అన్ని రాష్ట్రాల నుండి యోగ గురువులు పాల్గొన్న ఈ పోటీలలో ఉపాధ్యాయిని విజయలక్ష్మి అద్భుతమైన ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం సంబేపల్లి మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఈమె సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, కెజిబివి ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, సుభాషిణి, జగదీశ్వరమ్మ పాల్గొన్నారు.

మూడో రోజు కానిస్టేబుళ్ల ఎంపిక

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప నగర శివారులోని డిటిసిలో నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ మూడో రోజు గురువారం కొనసాగింది. మొత్తం 600 మంది అభ్యర్థులకు గాను 341 మంది పరీక్షలకు హాజరయ్యారు. 211 మంది క్వాలిఫై అయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి బి.రమణయ్య, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఐటి కోర్ టీమ్, డిపిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పరుగు పందెం పోటీలో అభ్యర్థులు

5న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని గాలివీడు రోడ్డు ఎగువ అబ్బవరం దగ్గరవున్న అర్చన విద్యాసంస్థల్లో 'మన ఊరు - మన సంక్రాంతి సంబరాలు' సందర్భంగా ఈనెల 5న ఉదయం 10 గంటలకు ముత్యాల ముగ్గులు, బండలాడుగుడు పోటీలు నిర్వహిస్తున్నామని అర్చన విద్యాసంస్థలు కరస్పాండెంట్ పి.మదనమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు విజేతలకు మొదటి బహుమతిగా రూ.6 వేలు, రెండవ బహుమతిగా రూ.4 వేలు, మూడవ బహుమతిగా రూ.3 వేలు నగదు బహుమతులను అందజే స్తామన్నారు. పోటీలలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ బహుమతులు ఇస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే బాలికలు, మహిళలు ముగ్గులకు అవసరమైన రంగులను వారే తీసుకొచ్చుకోవాలన్నారు. అర్చన విద్యా సంస్థలలో జనవరి 12న ఉదయం 10 గంటల నుండి ఒంగోలు జాతి ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తారన్నారు. పోటీలలోని విజేత ఎద్దులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతిగా రూ.30 వేలు, 4వ బహుమతిగా రూ.20 వేలు, 5వ బహుమతిగా రూ.10 వేలు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. సంప్రదాయంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా, సంతోషంగా నిర్వహించే బండలాగుడు ప్రదర్శనను రైతులు, ప్రజలు తిలకించాలని కోరారు.

'వెలుగు' వృద్ధాశ్రమంలో అన్నదానం

వెలుగులో అన్నదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో శ్రీకృష్ణ గ్రూపులు అధినేత శశిధర్ రావు కోడలు, హేమంత్ కుమార్ సతీమణి హిమజ పుట్టిన రోజుని పురస్కరించుకొని వెలుగు పాఠశాల, వృద్ధాశ్రమం, గరుండ సెంటరులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందరరేగా చిన్నారులు, వృద్ధులు హిమజకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గంగా బోర్‌వెల్స్ రమేష్, వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, సోషల్ వర్కర్ గీత, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

సెంట్రల్ కిచెన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

ప్రజాశక్తి-జమ్మలమడుగు/కడప/చింతకొమ్మదిన్నె

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి మహిళా ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. ఆకాంక్ష జిల్లా, బ్లాకుల అభివృద్ధి పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చిన ఆయన గురువారం జమ్మలమడుగు మండలం మోరగుడి ఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత సాధనకు కృషి చేస్తోందన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి ఒక్కరూ ఎదో ఒక రంగంలో స్వయం ఉపాధిని పొందుతున్నారంటే జిల్లా యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందని అందుకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రాథమిక సెక్టారులోని వ్యవసాయం, ఇండస్ట్రియల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. మోరగుడి ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కిచెన్ నిర్మాణం కోసం శిలాఫలకాన్ని కేంద్రమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఎస్ పంకజ్ దీక్షిత్, పిఐబి డైరెక్టర్ నంద కిషోర్‌రెడ్డి, ఆర్‌డిఒ సాయిశ్రీ, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో బ్లాకుల అభివృద్ధి : కలెక్టర్

ఆకాంక్ష జిల్లాలోని బ్లాకుల అభివృద్ధిని చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నామని కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఆకాంక్ష జిల్లా, బ్లాకుల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎకనామి, ప్రైమరీ సెక్టార్ కింద వ్యవసాయ వాటి అనుబంధ శాఖలు, సెకండరీ సెక్టార్ కింద పరిశ్రమలు, విజన్ యాక్షన్ ప్లాన్ 2024-29, టూరిజం, ఆస్పిరేషన్ డిస్టిక్ ప్రోగ్రాం కింద హెల్త్ న్యూట్రిషన్, విద్య, వ్యవసాయం, జలవనరులు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జమ్మలమడుగు, కమలాపురం ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కృష్ణ చైతన్యరెడ్డి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, వ్యవసాయ, ఉద్యాన, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు నాగేశ్వరరావు, సుభాషిని, డాక్టర్ నాగరాజు, డిఇఒ మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద నాయక్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు. అనంతరం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను మందుల స్టాక్, ఒపి నమోదు సంఖ్య తదితర వివరాలను ఆరోగ్యశాఖ అధికారులను అడిగి కేంద్ర మంత్రి తెలుసుకున్నారు. బుగ్గలపల్లి ఎస్‌సి కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు, పసిపిల్లల పోసినపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ ఉమా మహేశ్వర్ కుమార్, డాక్టర్ నాగశశి భూషణ్‌రెడ్డి, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, డిప్యూటీ డెమో రమణమ్మ, కుమారి మాణిక్యమ్మ, తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఒ కుళాయి బాబు, స్థానిక వైద్యాధికారులు రాఘవేంద్ర, సునీత పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావడం హర్షణీయం : ఎమ్మెల్యే

షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు మాజీ సైనిక ఉద్యోగి కంచర్ల శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో నిమ్మనపల్లి రోడ్డు రామాచార్లపల్లి వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరయ్యారు. 70 ఏళ్ల క్రితమే హిందూ శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం కేటాయించిన 6.32 ఎకరాల భూమిలో కంప చెట్లు ఏపుగా పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో శ్మశాన వాటికను అభివృద్ధి చేసే దిశగా కంచర్ల శ్రీనివాసులు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు పెద్ద ఎత్తున మదనపల్లి పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీ నేతలు తరలివచ్చారు. హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ఎమ్మెల్యే షాజహాన్ బాషా రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యే స్ఫూర్తితో పెద్ద ఎత్తున దాతలు ముందుకు వచ్చి రూ.5 లక్షల వరకు విరాళాలు ప్రకటించారు. బసినికొండ గ్రామానికి చెందిన మేస్త్రి గుట్ట రమణ రూ.25 వేలు, రామాచార్లపల్లికి చెందిన విక్రమ్ రూ.25 వేలు, కౌన్సిలర్ నాగార్జున బాబు రూ.50 వేలు, జనసేన సీనియర్ నాయకులు శ్రీరామ రామాంజనేయులు రూ.50 వేలు, వాల్మీకి సంఘం నాయకులు పులి శ్రీనివాసులు రూ.10 వేలు, రజక సంఘం నాయకులు నాగయ్య రూ.10 వేలు, నాదేళ్ల శివన్న రూ.10 వేలు, లారీ సుధ రూ.10 వేలు, ఎరుకుల సంఘం నాయకులు రమణ రూ.5 వేలు, షంషీర్ రూ.15 వేలు, రఘుపతి నాయుడు రూ.25 వేలు చొప్పున విరాళాలు ప్రకటించారు. దాతలు ఇచ్చిన విరాళాలే కాకుండా ఎమ్మెల్యే మరిన్ని నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్మశానవాటికలో షెడ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే షాజహాన్‌బాష చేతులు మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఆర్.జె.వెంకటేష్, నవీన్ చౌదరి, కత్తి లక్ష్మన్న, వెంకటరమణ, వై.యస్ మునిరత్నం, సంగం హరి, చిన్న మహేష్, జెసిబి వేణు, విజయమ్మ, ఉషారాణి, బసినికొండ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : 36 జిఒను ఇంజినీరింగ్ కార్మికులకు అమలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 3న జిల్లాలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల ఎదురుగా సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని గురువారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బండ్లమూడి వెంకటరమణ కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో వాటర్ సెక్షన్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్లకు ఏడేళ్ల నుంచి వేతనాలు పెంచలేదన్నారు. 15 నుండి 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నా కేవలం రూ. 15 వేల వేతనంతో పనిచేస్తున్నారని, పెరిగిన ధరలకనుగునంగా కనీసవేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేసి హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కోశాధికారి సి.రాంబాబు, ఉపాధ్యక్షులు ఎం.చెన్నయ్య, జె.శంకరయ్య ఇంజినీరింగ్ కార్మికులు దేవా, మల్లికార్జున ఖాదర్ వలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రమేష్ మృతిపట్ల సంతాపం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : వైసిపి నాయకులు కొత్తిమీర ప్రసాద్ సోదరుడు రమేష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో బుధవారం అకస్మాత్తుగా మృతి చెందారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాతరాయచోటిలో రమేష్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అతని మృతిపట్ల సంతాపం తెలిపి వారి కుటుంభ సభ్యులను పరామ ర్శించారు. వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షులు గువ్వల బుజ్జిబాబు, సుగవాసి శ్యామ్, బిసి సెల్ విజయభాస్కర్, గువ్వల జగదీష్, జగన్ నివాళులు అర్పించారు.

మొక్కల పంపిణీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

2025 మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నూతన సంవత్సరం 2025ని పురస్కరించుకుని జనసేన పార్టీ నాయకులు శ్రీరామ రామాంజనేయులు బర్మా రోడ్డు సాయిబాబా ఆలయం వద్ద 2025 మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెండా ఊపి మొక్కల పంపిణీ ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో మదనపల్లి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న జనసేన పార్టీ సీనియర్ నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త దానశిబిరాన్ని నిర్వహించి 100 యూనిట్లు రక్తాన్ని దాతల ద్వారా అందించారన్నారు. నియోజకవర్గ పరిధిలో 25 వేల మొక్కలు నాటేందుకు కార్యక్రమాన్ని ప్రారంభించిన రామాంజనేయులు స్ఫూర్తితో యువత ముందుకు వచ్చి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి మదనపల్లి ప్రశాంతతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగార్జున బాబు, మాజీ కౌన్సిలర్ బాబు నాయుడు, జీవి నాయుడు, విజయమ్మ, యువ నాయకులు శ్రీరామ హరిహరన్, జనసేన నాయకులు జగదీష్, శ్రీరామ వినోద్, నవీన్ చౌదరి, అధిక సంఖ్యలో జనసేన, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని తొగట వీర క్షత్రిక సంఘం కడప నగరశాఖ గౌరవాధ్యక్షులు సంగివాదం ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సన్మాన సభను ఈనెల 4న ఉదయం 10 గంటలకు ధర్మవరం లోని శివానగర్ శివాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేనేత కులాలకు సంబంధించిన తొగటవీర క్షత్రియులు, పద్మశాలీలు, దేవాంగులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పేర్కొన్నారు. కుల బాంధవులు ఎర్రముక్కపల్లె చౌడేశ్వరి ఆలయం వద్దకు శనివారం ఉదయం 6 గంటలకు చేరుకోవాలని తెలిపారు.

నేడు ఏకసభ్య కమిషన్ జిల్లాకు రాక

ప్రజాశక్తి - కడప: షెడ్యూల్ కులాలలోని ఉప వర్గీకరణపై విచారణ చేయడానికి ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ శుక్రవారం జిల్లాకు రానున్నట్లు డిఆర్‌ఒ విశ్వేశ్వరనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3ర ఉదయం.7.30గం.లకు కర్నూలు నుండి రోడ్డు మార్గం ద్వారా బయల్దేరి ఉదయం.10.30 గంటలకు జిల్లాకు చేరుకుంటారని, ఉదయం.11.00 గంటల నుండి మధ్యాహ్నం.2.00 గంటల వరకు జిల్లా యంత్రాంగంతో సమావేశం నిర్వహించడంతో పాటు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న సభా భవనంలో వివిధ ఉప కుల సభ్యులు, సంఘాలతో వినతి పత్రాలను స్వీకరిస్తారు.

సేంద్రియ వ్యవసాయానికి ఐటిసి వెన్నుదన్ను

మామిడి తోటలు పరిశీలిస్తున్న ఐటిసి బృందం

ప్రజాశక్తి-పీలేరు

సేంద్రియ వ్యవసాయ రైతులకు ఐటిసి సంస్థ వెన్నుదన్నుగా నిలిచేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు వారు పీలేరు నియోజకవర్గం పరిధిలో ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం సాగు చేస్తున్న రైతుల వివరాలు సేకరిస్తోంది. కెవి పల్లె మండలం, నూతనకాల్వకు చెందిన శివ అనే రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మామిడి పండిస్తున్న విషయాన్ని పీలేరుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి ద్వారా తెలుసుకున్న ఐటిసి సంస్థ దక్షిణ భారత ఎఎఫ్‌పిఒల అభివృద్ధి మేనేజర్ పురుషోత్తం, 'బైడ్స్' ఎన్‌టిఒ సీనియర్ మేనేజర్ భోజిరాజుతో కలిసి గురువారం శివ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్లో బాగా డిమాండ్ ఉన్నప్పటికీ తగినంతగా లభ్యత లేకపోవడంతో చాలా మంది రసాయనిక ఉత్పతులనే వాడుతున్నారన్నారు. వారందరికీ సేంద్రియ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో తమ సంస్థ సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. మామిడి, బొప్పాయి, అరటి పంటల్లో ఇప్పటికే సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులను గుర్తించి వారి పంటలను కొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఆ మూడు పంటలు సాగు చేసే ఆసక్తి ఉన్న రైతులకు తమ సంస్థ ద్వారా సాంకేతిక శిక్షణ ఇవ్వడంతోపాటు కొంత మేర ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేస్తామని చెప్పారు. మామిడిలో రెండు, మూడేళ్ల చెట్లున్న వారు పూర్తిగా సేంద్రియ పద్ధతిలోకి మారేందుకు అనువైన వాతావరణం కల్పిస్తామన్నారు. తమ పర్యవేక్షణలో పండించిన పంటలను తామే కొనుగోలు చేస్తామని, అలా తమకు అమ్మడానికి ఇష్టపడని రైతులు వారికి కావాల్సిన చోట అమ్ముకోవచ్చని పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గంలో ఇటువంటి రైతులను గుర్తించే బాధ్యతను బోదేషావలికి చెందిన ఎన్‌టిఒ 'ఆర్యాట్' సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు బోదేషావలిని 9703635827 నెంబరులో సంప్రదించాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న మామిడి సీజన్ నుంచే పీలేరులో తమ కార్యకలాపాలు మొదలుపెట్టనున్నట్లు పురుషోత్తం తెలియజేశారు.

దారి సమస్యకు పరిష్కారం చూపుతున్న తహశీల్దార్ భాగ్యలత

దారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని చీమలచెరువుపల్లి పంచాయతీ కస్పాకు చెందిన రైతులు దారి సమస్య గురించి గత డిసెంబర్ 21న రెవెన్యూ సదస్సులో తహశీల్దార్‌కు భాగ్యలతకు వినతి పత్రం సమర్పించారు. ఆ సమస్యను పరిష్కరించడానికి గురువారం తహశీల్దార్ సీసీపల్లి గ్రామానికి వెళ్లి చెరువు కట్ట వద్ద ఉన్న దారి స్థలాన్ని హద్దులను సర్వే చేయించారు. అక్కడి రైతులు పిలిపించి రికా ర్డులో దారికి అనుమతి ఉందని ఆదారి నడుచుకోవచ్చని తెలిపారు. కొద్దిగా దారి అవసరమైతే ఒక మూరెడు స్థలం ఇవ్వడానికి కూడా చుట్టుపక్క రైతులు సహకారం అందించారని కోరారు. కార్య క్రమంలో గ్రామస్తులు ఎన్. వెంకటమ్మ, మల్లమ్మ, సిద్ధారెడ్డి, తమటం ఈశ్వర్ రెడ్డి, వెంకటరెడ్డి కాల్వ పల్లి, రామేశ్వర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, విఆర్‌ఒ శేఖర్, సర్వేయర్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొ న్నారు.

బెస్ట్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా కోట రమేష్‌నాయుడు

ప్రజాశక్తి-కలకడ

కోట రమేష్ నాయుడును సన్మానిస్తున్న ఎంఇఒలు

స్కూల్ కమిటీ బెస్ట్ చైర్మన్‌గా రమేష్‌నాయుడును ఎన్నుకున్నట్లు ఎంఇఒ మునీంద్ర నాయక్ తెలిపారు. మండల కేంద్ర మైన కలకడ ఆదర్శ పాఠశాలలో స్కూల్ కమిటీ చైర్మన్ గా కోట రమేష్ నాయుడు ఎన్నికైనప్పటి నుంచి నేటి వరకు పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ అందరి మన్న నలు పొందుతూ ఆదర్శ పాఠశాలను జిల్లాలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి తన సాయి శక్తుల కృషి చేస్తున్నట్లు ఎంఇఒ కొనియాడారు. గురువారం స్కూల్ కమిటీ చైర్మన్ కోట రమేష్ నాయుడు పాఠశాలలో రోడ్డు ఇరువైపులా రకరకాల చెట్లు నాటించడం, మరోవైపు విద్యార్థులు బస్సు ఎక్కడానికి రోడ్డు మధ్యలో ఉండకుండా వారు ఉండడానికి కావలసిన ప్రాంతాన్ని చదును చేయించి ప్రమాదాలు జరగకుండా విద్యార్థుల పట్ల చొరవ తీసుకొని సౌకర్యాలు ఏర్పాటు చేయించారని అన్నారు. విద్యార్థుల క్రీడల కోసం ఆట స్థలాన్ని చదును చేయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి వారు క్రమశిక్షణతో ఉండేలా పాఠశాలల్లో పనిచేసే ఒక ఉపాధ్యాయుడిలా శ్రమించడం అందరిని ఆకట్టు కున్నట్లు తెలిపారు. తన సొంత నిధులతో పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న చైర్మన్ కోట రమేష్ నాయుడును ఎంఇఒ మునీంద్ర నాయక్, కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోడం చంగల్ రాయుడు, ఉపాధ్యా యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పాఠ శాలలో తన సొంత ఇల్లు లాగా, విద్యార్థులను తన కన్న బిడ్డల వలె చూసుకుని వారికి కావలసిన సౌకర్యాలను సమకూర్చడానికి తన సొంత డబ్బులే కాకుండా రాష్ట్ర ప్రభుత్వా న్నిధులను కూడా తెప్పించి పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు 'గడికోట' పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి కార్యకర్తలను, వారి కుటుంబ సభ్యులను వైసిపి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ చెనికాయల వాండ్లపల్లిలో మాజీ సర్పంచ్ మల్ రెడ్డి సతీమణి, ప్రవీణ్ కుమార్ రెడ్డి తల్లి చంద్రావతమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ రెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య విష యాలు తెలుసుకుని పరామర్శించారు. మజ్జిగవాండ్లపల్లి చెందిన ఈశ్వర్‌రెడ్డి అనే కార్యకర్తకు ఇటీవల పెరాలసిస్‌తో చికిత్స పొందుతు ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న కార్యకర్తను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలు సుకున్నారు. గడికోట సర్పంచ్ భూమారపు రామాంజులు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ మాజీ సభ్యుడు శివశంకర్, వైసిపి గ్రామ నాయకులు మార్పురి ఆదిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఈడగొడ్డు నరసింహులు, మజ్జిగ పాల్‌రెడ్డి, నారాయ ణరెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ చూపుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎస్‌ఎస్‌సి స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని తూర్పు ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు హేమలత మండలంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యుటిఎఫ్ వారిచే తయారు చేయబడ్డ ఎస్‌ఎస్‌సి మెటీరియల్ వితరణ చేశారు. సుమారు పదిహేను వేల రూపాయలు విలువ కలిగిన పుస్తకాలను ఎంఇఒల చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ మెటీరియల్ ద్వారా చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరమని తెలిపారు.

చిన్నరెడ్డి మృతి బాధాకరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండల పరిధిలోని మర్రిమీరెడ్డిగారిపల్లికి చెందిన మండల ప్రత్యేక ఆహ్వానితులు వైసిపి నాయకుడు చిన్నరెడ్డి గుండెపోటుతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వైసిపి నాయకులతో కలిసి చిన్నరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. చిన్న రెడ్డి మృతికి పార్టీకి తీరని లోటు అన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు : 'ముక్కా'

ప్రజాశక్తి-పెనగలూరు

చదువుకు పేదరికం అడ్డుకాకూడదని కుడా చైర్మన్ ముక్కా రూపా నందరెడ్డి పేర్కొన్నారు. పెనగలూరు మండలం, కొండూరు గ్రామంలో నివా సమున్న పసుపులేటి పద్మ భర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తన కొడుకు కాలేజీ ఫీజు చెల్లించలేని స్థితిలో ముక్కా వరలక్ష్మికి తెలిపారు. వెంటనే స్పందించి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రూపానందరెడ్డి

ఎంపిడిఒపై చట్టపరమైన చర్యలకు సిద్ధం

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి- బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశ నిర్వహణకు కావలసిన ఎంపిటిసిల సంఖ్య బలం ఉన్నప్పటికీ సమావేశాన్ని నిర్వహించకుండా వాయిదా వేసిన ములకలచెరువు ఎంపిడిఒపై చట్టపరమైన చర్యలకు సిద్ధమైనట్లు వైసిపి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. గురువారం ములకలచెరువు మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని కూటమి నాయ కులు అడ్డుకోవడంతో ఎమ్మెల్యే ఎంపిడిఒ హరినారాయణను చర వాణిలో సంప్రదించారు.నిబంధనల ప్రకారం వైసిపికి సంఖ్యా బలం ఉన్న ప్పటికీ ఎందుకు సర్వసభ్య సమావేశం నిర్వహించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అధికారంలో లేకపోయినప్పటికీ అభివృద్ధిపై దృష్టి సారిం చామన్నారు. అభివృద్ధికి సహకరించాలని అధికారులు ఇలా అధికార పార్టీకి కొమ్ము కాయడం ఎంతవరకు సమంజసం అన్నారు. దీనిపై హైకో ర్టును

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ఆశ్రయిస్తామని అన్నారు. అప్పుడు ఉద్యోగం వదిలి కోర్టు చుట్టూ తిర గాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అసభ్యక రంగా ప్రవర్తించడం కూటమి ప్రభుత్వానికే చెల్లింద న్నారు.మండల సర్వసభ్య సమా వేశానికి వందల సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి భయానక పరిస్థితులు నెల కొల్పడం ఎంతవరకు సమంజస మని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారని, వారికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.

పాఠశాల అభివృద్ధికి ప్రణాళిక వేసుకోవాలి : డిఇఒ

రాజంపేట : సూచనలు ఇస్తున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాఠశాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం అయ్యేలా పాఠశాలల యాజమాన్య కమిటీ చొరవ చూపాలని డిఇఒ కె.సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. గురువారం రాజంపేట పట్టణంలో ని బాలికోన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 110 మంది విద్యా కమిటీ చైర్మన్‌లు, 110 మంది ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు సమయపాలన పాటించకపోయినా, పాఠశాలకు రాకపోయినా వారిని ఇంటి వద్ద చక్కగా చదివించే బాధ్యత విద్యా కమిటీ తీసుకోవాలని సూచించారు. ఇందుకు తమ నుంచి, ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్య, అందుకు తగ్గ తరగతి గదులు గురించి పాఠశాల విద్యా కమిటీ ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. భవిష్యత్తులో పాఠశాల నిర్వహణలో విద్య కమిటీలు కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రఘునాథరాజు, ఎంఆర్‌సి జిలాన్‌ఖాన్ , పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** పాఠశాలలకు కేటాయించిన నిధుల వినియోగాన్ని ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు పారదర్శకంగా జరపాలని ఎంఇఒలు పద్మావతి, నారాయణ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) లో మండల స్థాయిలో పాఠశాల యాజమాన్య కమిటీ కు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్, బి.శ్రీనివాసులు, సి.మీనా, రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. సిఆర్‌పిలు, జడ్‌పి.హెచ్.ఎస్ (తెలుగు) ఎస్‌ఎంసి చైర్మన్ కృష్ణయ్య పాల్గొన్నారు. **రామాపురం :**పాఠశాల అభివృద్ధికి స్కూల్ కమిటీ ప్రణాళికలు వేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు, ఎంఇఒ-2 జయచంద్ర పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం పాఠశాలల యాజమాన్య కమిటీలకు మండల స్థాయిలో ఒక్కరో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశా లలో విద్యార్థుల నమోదు, విద్యార్థుల హాజరు, పాఠశాల మౌలిక వసతులు, తరగతి గదులు, పిల్లలు కావాల్సిన ఆట స్థలాలు, ఉపాధ్యా యుల హాజరు ఇలాంటి విషయాలపై కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోవాల న్నారు. బిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, శివ బి.ఫార్మశీ కళాశాల కరస్పాండెంట్ ఎం .భాస్కర్ తమ కాలేజీ తరుపున 2025 క్యాలెండర్‌ను విద్యాశాఖ అధికారులతో ఆవిష్కరింపజేశారు. ఈ సంద ర్భంగా భాస్కర్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు కలిగి ఉన్నాయని అన్నారు. మూరుమూల గ్రామాల్లో విద్యార్థులకు సైతం ఉన్నత విద్యను అందించాలని సంకల్పంతో బండపల్లిగ్రామంలో తమ విద్యాసంస్థలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో రీసెర్చ్ పర్సన్స్ బి.విశ్వనాథ్, కె.కుమార్, జీవి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు విశ్వనాథ్, గోవర్ధన్, భానుమతి, అంజనమ్మ, పేరెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **కలికిరి :** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి లక్ష్యంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లు పనిచే యాలని ఎంఇఒలు కరీముల్లా, ఎం.నాగార్జున తెలిపారు. మండల స్థాయి పాఠశాల యాజ మాన్య కమిటీ ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్న త పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలు, వారు పర్యవేక్షించాల్సిన అంశాలు, పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం మొదలైన అంశాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చినట్లు తెలి పారు. కార్యక్రమంలో ఆర్‌పిలుగా మురాష వలి, పి ఖాదరవల్లి, శైలజ, జ్యోతి, శివశంకర్ వ్యవహరించారు. ఈ శిక్షణను 3, 4, 6వ తేదీలలో పాఠశాల స్థాయిలో యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. **పీలేరు:** ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధిలో విద్యా కమిటీల పాత్ర కీలకమైందని పీలేరు మండల విద్యాశాఖ అధికారులు వై.లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ తెలిపారు.స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో కొత్తగా ఏర్పడిన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీలకు విధి- విధానాలు, బాధ్యతల గురించి, విద్యాహక్కు చట్టం అమలు, సమకాలీన అంశాలు, పాఠశాలలోని సమకాలిన పాఠశాల అంశాలు, వాటి పరిష్కారాలు, సామాజిక తనిఖీలు, పాఠశాల అభివృద్ధి ప్రణాళికలు, ప్రజల భాగస్వామ్యం, పాఠశాల యాజమాన్య కమిటీలు పాఠశాలలో నిరంతరం అనుసంధానంగా ఉండి ప్రజల భాగస్వామ్యంతో పాఠశాల కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజి నటరాజన్, ఆర్పీలుగా ఉపాధ్యాయులు ఓబుల్ రెడ్డి, సురేష్ కుమార్, అల్తాఫ్, నజీర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమీటీ చైర్మన్ శ్రీరాములు, లావణ్య, సిఆర్పీలు మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్, మాధవి, మండలంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

రామాపురం: మాట్లాడుతున్న ఎంఇఒ

దిగువ గుల్లవాండ్లపల్లెలో ప్రాథమిక పాఠశాలకు ఏర్పాటు చేసిన ప్రహరీ

ప్రజాసేవే ధ్యేయం

- గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి
- పేదలకు అండగా ఉంటాం
- టిడిపి మండల నాయకులు ఎరపురెడ్డి శరత్ గిరిరెడ్డి

ప్రజాశక్తి-సుండుపల్లి

పేద ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఎరపురెడ్డి శరత్ గిరిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండల కేంద్రం సుండుపల్లె గ్రామపంచాయతీలో సాకలపల్లెలో తాగునీటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు తన దృష్టికి తీసుకవచ్చిన వెంటనే సొంత నిధులతో బోరు మోటర్ పైప్ లైన్ వేయించి ఆ గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. దిగువ గుల్లవాండ్లపల్లెలో ప్రాథమిక పాఠశాల సుందరీకరణకు తన సొంత నిధులతో ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేయించినట్లు చెప్పారు. పాఠశాలలోని పాడుబడిన తరగతి గదులకు మరమ్మతులు చేయించి, రంగులు వేయించినట్లు తెలిపారు. పాఠశాల చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేసి విద్యార్థులకు సౌకర్యవంతంగా, మంచి వాతా వరణంలో చదువుకునేలా వసతులు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. అదే గ్రామంలో రామాలయాన్ని సొంత నిధులతోనే నిర్మించి రామలక్ష్మణ విగ్రహాలు ప్రతిష్టాపన చేశామన్నారు. సాత్‌పల్లి పాటు మండల కేంద్రంలోని యానాదికాలనీల్లో కూడా తన సొంత నిధులతోనే రామాలయాలు ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఎగువఈడిగపల్లె సమీపంలోనే అభయ ఆంజనేయ స్వామి గుడిని సొంత నిధులతోనే ఏర్పాటు చేశామన్నారు. ప్రతి వారం గ్రామస్తులు చెక్కభజనలు, దేవాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకునేలా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించామని చెప్పారు. సుండుపల్లె గ్రామ ప్రజలకు గ్రామాల్లో అభివృద్ధి అంటే ఎంటో తెలియని స్థితిలో తన తల్లి ఎరపురెడ్డి నిర్మలమ్మ సర్పంచ్

ఎంపికై పలు గ్రామాలలో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, వీధిలైట్లు, విద్యుత్ లేని గ్రామాలకు విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించారని అన్నారు. అప్పట్లో గ్రామంలో ఉన్న నాయకులు ఎవరూ మండలాన్ని అభివృద్ధి చేసిన పాపాన పోలేదని అన్నారు. తన తల్లి సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిం చామని తెలిపారు. గాండపల్లి సమీ పంలోని గిరిజన గురుకుల పాఠశాల చుట్టుపక్కల అడవిని తలపిం చేలా ముళ్లపొదలు ఉండటంతో విష పురుగులు సంచరిస్తున్నాయని విద్యా ర్థులు భయాందోళన చెందుతున్నారని ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు నాయుడు తమ దృష్టికి తీసుక వచ్చారని అన్నారు.తమ దృష్టికి వచ్చిన వెంటనే పాఠశాల చుట్టూ ముళ్ల పొదలను తొలగించి, పారిశుధ్య పనులు చేయించి శుభ్రం చేయించా మని అన్నారు. విద్యార్థుల ఆడుకు నేందు కు క్రీడా స్థలాన్ని చదును చేయిం చినట్లు చెప్పారు. తాను కూడా తెలుగుపార్టీలో ఉంటూ ప్రజాసేవ సేవే లక్ష్యంగా పనిచేస్తున్నానని అన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశానని అన్నారు. ప్రతినిత్యం ప్రజలతో మమేకమవుతూ వారికి సమస్యలు తెలుసుకుంటూ అండగా ఉన్నానని చెప్పారు. పేద ప్రజల నుంచి తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

వాలంటీర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి-నందలూరు

ఎన్‌డిఎ కూటమి ఎన్నికల ముందు వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ వాలంటీర్లు డిమాండ్ చేశారు. గురువారం గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పదివేల రూపాయలు జీతం వాలంటీర్లకు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఆరు నెలలు కావస్తున్నా ఇంకా వాలంటీర్లపైన ఎటువంటి జాబ్ చార్ట్ గాని ఏమి ఇవ్వలేదని, ఆరు మాసాలు కావస్తున్నా జీతాలు కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధి లాగా ఉన్న వాలంటీర్లను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుబెట్టుకొని తమకు ఉద్యోగ భద్రత కల్పిచాలని కోరారు. తక్షణమే వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకుని, రూ.10వేలు జీతం ఇవ్వాలని, బకాయి పడ్డ గౌరవ వేతనాన్ని కూడా చెల్లిం

పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందిస్తున్న వాలంటీర్లు

చాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు సాయి కృష్ణ, అజయ్, శ్రీకాంత్,కమల్ భాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుధీర్‌కుమార్, మహిళా వాలంటీర్లు సుబ్బలక్ష్మమ్మ, మాణిక్యమ్మ, పావని, స్వప్న, రేవతి, జ్యోతి, అమ్ములు, ఎల్లమ్మ పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ప్రతి గ్రామంలో సిసి రోడ్లు ఏర్పాటు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు ఏర్పాటు చేసా మని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం ఓబు లవారిపల్లి మండల పరిధిలోని వైకోట పంచాయతీలో రూ.7.50లక్షల వ్య యంతో చేపట్టనున్న సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి వీధికి సిమెంటు ఏర్పాటు చేస్తా మని తెలిపారు. ప్రతి మారుమూల గ్రామానికి సైతం నూతన వైభవం తీసు కొస్తున్నామని చెప్పారు. ఏ గ్రామంలోనైనా రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నా మని తెలిపారు. సిసి రోడ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నాణ్య తతో చేప ట్టాలని ఎక్కడైనా నాణ్యత లోపం కనిపించినట్లయితే చర్యలు తప్పవని పేర్కొ న్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-రామాపురం

రబీ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లక్కిరెడ్డిపల్లె ఎడి. జయరాణి పేర్కొన్నారు. మండ లంలోని గోపగుడిపల్లి పంచాయతీలో గురు వారం మండల వ్యవసాయ అధి కారి నాగమణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈ రబీ సీజన్‌లో సాగు చేసి న పంటలు వివరాలను ఇ-పంటలో నమోదు చేసుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో వేరుశనగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామాపురం: ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రామాపురం

రెవెన్యూ సదస్సులతోనే ప్రజల సమస్యలు పరిష్కారం లభిస్తుందని ఆర్‌డిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కుమ్మరపల్లె సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. సమస్యల కోసం వచ్చిన ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం చేయకూడదని సమస్యలపై వచ్చిన ప్రజలకు ఓపికతో సమాధానం ఇచ్చి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనేయులు, నోడల్ అధికారి మనీ, టిడిపి నాయకులు కోటిరెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, రామంజు రెడ్డి, భాస్కర్, సుభాన్ పాల్గొన్నారు. **పీలేరు:** గ్రామాల అభివృద్ధికి గ్రామసభలు కీలకమని పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా తెలిపారు. పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సామాజిక అవసరాలను, సమస్యలను గుర్తించి సభల ద్వారా ప్రణాళికలు రూపొందించి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు శ్రీనాథ్ రెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, కాలేషా, ఉదయ్ కుమార్, సాంబశివారెడ్డి, తిక్క రమణ, సచిన్ అలియాస్ ఖాదర్, ఆబిద్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులే ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ అరవింద కిషోర్ తెలిపారు.పాసు పుస్త కంలో పేరు మార్పులు, ఆన్‌లైన్ సమస్యలు, రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 133 దరఖాస్తులు రావడం జరిగిందని అందులో రెవెన్యూ 37, రేషన్ కార్డులు 25, పెన్షన్ 59, దేవాదాయ శాఖ2, గృహ నిర్మాణం 6, సర్వే కోసం 3 అందాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుశీల్‌కుమార్, విఆర్‌ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మదనపల్లి పట్టణం బుగ్గ కాలవకు చెందిన నారాయణ(38), ట్రాక్టర్‌లో సొంత పనులపై నిమ్మనపల్లెకు వచ్చి తిరిగి మదనపల్లెకు వెళ్ళుతుండగా, మార్గమధ్యమంలోని ముష్టూరు పంచాయతీ మర్రిబండ వద్ద కారు ఎదురుగా రావడంతో, వాహనానికి తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ టైరు క్రింద పడ్డ నారాయణ తీవ్రంగా గాయపడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 అంబులెన్స్ ఇఎంటి రెడ్డి జస్వంత్, పైలెట్ సద్దాం సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట: ఓబులవారిపల్లి మండల పరిధిలోని వై కోట గ్రామానికి చెందిన షేక్ నూరమ్మ గారి తాజన్‌కి చికిత్స జరగక ముందే రూ.2.50లక్షలు సిఎం సహాయనిధిని ఎమ్మెల్యేఆరవ శ్రీధర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిందని పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన పేదలకు సాయం అందించడం కోసం కృషి చేస్తామని చెప్పారు.నియోజకవర్గంలోని పేదలను ఆదుకునేందుకు సంసిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

బాధితురాలికి సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్